హనుమకొండ చౌరస్తా : వరంగల్ ఐటీఐలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ చందర్, విద్యార్థులు

ఐటీఐలో పహల్గాం మృతులకు నివాళి

హనుమకొండ చౌరస్తా/కాజీపేట , ఏప్రిల్ 28 : జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా ములుగు రోడ్డులోని వరంగల్ ఐటీఐ కాలేజీలో ప్రిన్సిపాల్ మంగునూరి చందర్ ఆధ్వర్యంలో ఆల్ స్టాఫ్ మెంబర్స్, విద్యార్థులు సంతాపం తెలిపారు. జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళులర్పించారు. పహల్గాం మృతుల ఆత్మశాంతి కోసం కాజీపేట ఐటీఐ విద్యార్థులు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఐటీఐ నుంచి ప్రారంభమైన ర్యాలీ చౌరస్తా వరకు సాగింది. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. ఘటన జరిగి వారం రోజులు కావస్తున్నా చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. ఐటీఐ సిబ్బంది నాసిక్, అనిల్, లత, రవివర్మ, తిరుపతమ్మ, దృషాలి, చక్రవరి పాల్గొన్నారు.

సభ విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు

- బీఆర్ఎస్ నాయకులు
- కాజీపేటలో కేక్ కట్ చేసి స్వీట్ల పంపిణీ
- పటాకులు కాల్చి సంబురాలు

కాజీపేట : స్వీట్లు తినిపించుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

కాజీపేట/ఐనవోలు/హసన్‌పర్తి, ఏప్రిల్ 28 : ఎల్కతుర్తిలో నిర్వహించిన రజతోత్సవ సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలకు కార్పొరేటర్ సంకు నర్సింగరావు, పార్టీ రాష్ట్ర నాయకుడు నార్లగిరి రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం సంబురాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి, పటాకులు కాల్చారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ప్రపంచమే అబ్బురపరిచేలా సభలు, సమావేశాలు నిర్వహించడంలో కేసీఆర్ దిట్ట అని అన్నారు. కొంతమంది కాంగ్రెస్ చీడ పురుగులు సభపై లేనిపోని ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకున్నారన్నారు. కేసీఆర్ అంటేనే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవమని, తెలంగాణ స్త్రీ మూర్తులంటే ఆయనకు ఎంతో గౌరవమన్నారు. కార్యక్రమంలో శిరుమల్ల దశరథం, గబ్బెట శ్రీనివాస్, డివిజన్ల అధ్యక్షులు పాలడుగుల శివకుమార్, దువ్వ కనుకరాజు, బెదరికోట రంజిత్, నయీం జుబేర్, మర్యాల కృష్ణ, కొండ్ర శంకర్, బరిగెల వినయ్, తండమల్ల వేణు, మహమూద్, మతిన్, ఇమ్మడి రవి, మండల సుబ్బు, పడిదల శేఖర్, బండి రాంచందర్, సందీప్, విజయ్, రామగిరి రాంచందర్ పాల్గొన్నారు. రజతోత్సవ సభను విజయవంతం చేసినందుకు బీఆర్ఎస్ మండల కన్వీనర్ తంపుల మోహన్ ధన్యవాదాలు తెలిపారు. సోమవారం హసన్‌పర్తిలో ఆయన మాట్లాడారు. జడ్పీ మాజీ కో ఆప్షన్ ఉస్మాన్‌అలీ, నాయకులు కాటబోయిన అశోక్, గడ్డం రఘువంశీ, కాటబోయిన చందు ఉన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఒక్క పిలుపుతో ఎల్కతుర్తిలో నిర్వహించిన రజతోత్సవ సభకు చీమల దండులా వచ్చి విజయవంతం చేసిన ప్రజలు, పార్టీ నాయకులకు హసన్‌పర్తి మండలాధ్యక్షుడు బండి రజినీకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఎర్రగట్టు గుట్ట వద్ద ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు మేక భగవాన్‌రెడ్డి, 65, 66వ డివిజన్ల అధ్యక్షులు నద్దునూరి నాగరాజు, పాపిశెట్టి శ్రీధర్, ప్యాక్స్ వైస్ చైర్మన్ పాడి మల్లారెడ్డి, నాయకులు చాతళ్ల వేణుగోపాల్, వంశీ పాల్గొన్నారు.

ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

సుబేదారి, ఏప్రిల్ 28 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సోమవారం కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనరేట్ సీసీఎస్ విభాగంలో పనిచేస్తున్న ఎల్ రఘు నర్సంపేటకు బదిలీ కాగా, అక్కడ పని చేస్తున్న రమణమూర్తి సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

పోలీసు కుటుంబాలకు భద్రతా చెక్కుల పంపిణీ

సుబేదారి, ఏప్రిల్ 28 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో మరణించిన ఏఎస్సై మల్లికార్జున్, సిబ్బంది వెంకటేశ్వర్లు, రమేశ్ కుటుంబాలకు సోమవారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్ భద్రతా చెక్కులను అందజేశారు. అలాగే వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ప్రొఫెసర్ సురేశ్‌లాల్, సిరాజుద్దీన్, విష్ణువర్ధన్ సీపీని కలిశారు. ఈ నెల 29న నిర్వహిస్తున్న పీస్ పండుగ కార్యక్రమానికి హాజరు కావాలని సీపీని కోరారు.

చైల్డ్‌లైన్‌కు బాలిక అప్పగింత

కాజీపేట, ఏప్రిల్ 28 : ఇంట్లో నుంచి తప్పిపోయి వచ్చి కాజీపేట రైల్వే స్టేషన్‌లో తిరుగుతున్న బాలికను ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది చేరదీసి చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. కాజీపేట జీఆర్పీ సీఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఆర్పీఎఫ్ సిబ్బందికి ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై బాలిక ఒంటరిగా కనిపించగా, వివరాలు సేకరించారు. బాలిక తన పేరు కావ్య (6), తండ్రి వీరన్న, గ్రామం మండపల్లి, జిల్లా ఒంగోలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా తెలిపిందన్నారు. ఆ బాలికను చైల్డ్‌లైన్ సిబ్బందికి అప్పగించామన్నారు. ప్రస్తుతం ఆ బాలిక నగరంలోని చైల్డ్‌లైన్ కేంద్రంలో ఆశ్రయం పొందుతున్నట్లు చెప్పారు. తప్పిపోయి వచ్చిన ఆ బాలికకు ఎవరైనా సంబంధీకులుంటే కాజీపేట జీఆర్పీ సీఐ లేదా 87126 58578, 9712658609 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేశ్

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో గణేశ్

హనుమకొండ, ఏప్రిల్ 28 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, బడి బయట పిల్లలను గుర్తించి చేర్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేశ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు, దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రం సేవలు, వయోజన విద్య, సార్వత్రిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడం, మహిళా సంఘాల పాత్రపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా విద్యాశాఖ, వయోజన విద్య, ఓపెన్ స్కూల్ అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి బడి వయసు పిల్లలను ఒకటో తరగతిలో ప్రవేశం చేయించాలని సూచించారు. గ్రామ విద్యా నమోదు పుస్తకం నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇచ్చే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, మధ్యాహ్న భోజనం, ఏక రూప దుస్తుల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేర్చాలని, కనీస వ్యక్తిగత సామర్థ్యం పెరిగేటట్లు చూడాలని, వారికి ఇంటి వద్ద విద్య, ఫిజియోథెరపీ సేవలు అందేలా చూడాలన్నారు. నిరక్షరాస్య వయోజనులు సామాజిక చైతన్య కేంద్రానికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్వచ్ఛంద బోధకులు వయోజనులకు చదువు చెప్పాలని సూచించారు. నవ భారత అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా 2035 నాటికి వయోజనులను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. చదువు మధ్యలో మానేసిన వారిని సార్వత్రిక పాఠశాలలో నమోదు చేసి 10వ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో వయోజన విద్య ప్రాజెక్టు అధికారి రమేశ్‌రెడ్డి, జిల్లా విద్యా శాఖ సమన్వయకర్త బద్దం సుదర్శన్‌రెడ్డి, డీపీఎం దాసు, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ సదానందం పాల్గొన్నారు.

అధ్యాపకులకు భారతీయ ప్రమాణాలపై అవగాహన

ఎన్ఐటీలో అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి, కేవీ రావు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 28 : నిట్ అధ్యాపకులకు భారతీయ ప్రమాణాల బ్యూరో(బీఐఎస్) అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు భారతీయ ప్రమాణాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు, తరగతుల్లో ప్రమాణాలను భాగం చేసేందుకు ఇటీవల బీఐఎస్, ఎన్ఐటీతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ చేస్తున్న కార్యక్రమాలు, ప్రమాణాల రూపకల్పన, నాణ్యతా పరీక్ష విధానాలు, విద్యార్థులకు బీఐఎస్ అందిస్తున్న ప్రోత్సాహకాలు తదితర అంశాలపై అధ్యాపకులకు వివరించారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి, బీఐఎస్ సీనియర్ డైరెక్టర్ కేవీ రావు, హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్ఐటీ బీఐఎస్ మెంటార్ ప్రొఫెసర్ రతీశ్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ సుజాత, జాయింట్ డైరెక్టర్లు రాకేశ్ తన్నీరు, రాజేశ్, డిప్యూటీ డైరెక్టర్లు కెవిన్, అజిత్ పాల్గొన్నారు. విద్యార్థులకు తరగతి గది నుంచే భారతీయ ప్రమాణాల గురించి తెలిపాలని అవసరం ఉందని నిట్ డైరెక్టర్ అన్నారు.

నేటి నుంచి భద్రకాళీ కల్యాణ బ్రహ్మోత్సవాలు

న్యూశాయంపేట : దాస్యంకు ఆహ్వానపత్రం అందజేస్తున్న మున్నూరు కాపులు

వరంగల్/హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 28 : భద్రకాళీ ఆలయంలో మంగళవారం నుంచి భద్రకాళీ, భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సాలు వైభవంగా నిర్వహించనున్నామని ప్రధాన అర్చకుడు భద్రకాళీ శేషు తెలిపారు. సోమవారం ఆలయంలో ఈవో శేషు భారతితో కలిసి ఆయన బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 29 నుంచి మే 10వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. మే 2న భద్రకాళీ, భద్రేశ్వరుల కల్యాణం జరుగుతుందన్నారు. ఆలయ సూపరింటెండెంట్లు విజయకుమార్, హరినాథ్, సిబ్బంది నాగులు, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు. హనుమకొండ చౌరస్తాలో జరిగిన సమావేశంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు పెండోట చక్రపాణి, సంగోజు మోహన్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి ఉన్నారు.

దాస్యంకు ఆహ్వాన పత్రిక..

న్యూశాయంపేట : బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అంకురార్పణ కార్యకమం, గణపతి సేవ, సుబ్రహ్మణ్యేశ్వర సేవా కార్యక్రమాలకు హాజరు కావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్‌ను హంటర్ రోడ్డులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వరంగల్ ఉమ్మడి జిల్లా మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య, జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల రవికుమార్ ఉన్నారు.

మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

లింగ సమానత్వంతోనే బాలల పరిరక్షణ

ఆత్మకూరు, ఏప్రిల్ 28 : లింగ సమానత్వంతోనే బాలల పరిరక్షణ సాధ్యమని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఇంకా మహిళలపై అనేక రకాలుగా హింస జరుగుతున్నదన్నారు. ఆడపిల్లలపై వివక్షత చూపిస్తున్నారని తెలిపారు. బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణాకు ఎవరైనా ప్రయత్నిస్తే వెంటనే డయల్ 100, చైల్డ్ లైన్ 1098కి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్, మా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి నాగబండి శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్వేత పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు అన్యాయం చేసే కుట్ర

శాయంపేట, ఏప్రిల్ 28 : ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు అన్యాయం చేసే కుట్ర జరుగుతున్నదని బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ అన్నారు. ఈ మేరకు ఎంపీడీవోను కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతి గ్రామాన్ని సందర్శించి అక్కడ ఎంతమంది ఇళ్లు లేని నిరుపేదలు ఉన్నారో గుర్తించి మొదటి విడుతలో వారికి మంజూరయ్యేలా కృషి చేయాలన్నారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

సమ్మక్క (ఫైల్)

దామెర, ఏప్రిల్ 28 : మండల కేంద్రానికి చెందిన దొడు సమ్మక్క(70) మానసిక పరిస్థితి బాగాలేక ఓ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని ఎస్సై కొంక అశోక్ సోమవారం తెలిపారు. ఆస్తమాతో బాధపడుతున్న సమ్మక్క ఆదివారం రాత్రి ఇంటి బయట నిద్రించింది. తెల్లవారుజామున కనిపించకపోవడంతో కుమారుడు సురేశ్ చుట్టుపక్కల వెతికాడు. గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో సమ్మక్క మృతదేహం కనిపించింది. కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలి

మేయర్ గుండు సుధారాణి

నర్సరీని పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్, ఏప్రిల్ 28 : వన మహోత్సవంలో నాటేందుకు గ్రేటర్ కార్పొరేషన్ లక్ష్యానికి అనుగుణంగా నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె ఎల్లాపూర్‌లో బల్దియా నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా గ్రీన్ షేడ్ మ్యాట్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. పూలు, పండ్ల మొక్కలను ఎక్కువ సంఖ్యలో పెంచాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వో రమేశ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

బల్దియా గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, ఏప్రిల్ 28 : సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం కార్పొరేషన్‌లోని చాంబర్‌లో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్థానిక సమస్యలను గ్రీవెన్స్‌లో బాధితులు కమిషనర్ ముందు ఏకరువు పెట్టారు. కాలనీల్లో మౌలిక వసతులు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రోడ్లు, డ్రైనేజీలు లేవని వాపోయారు. గ్రీవెన్స్‌లో వినతులు ఇచ్చినా పరిష్కారం కావడం లేవని, పలుమార్లు గ్రీవెన్స్ చుట్టూ తిరగాల్సి వస్తున్నదని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. 43వ డివిజన్ గణేశ్‌నగర్‌లో కనీస వసతులు లేవని కాలనీ వాసులు విన్నవించారు. రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. రెడ్డికాలనీలో ప్లాన్‌కు విరుద్ధంగా రోడ్డు నిర్మిస్తున్నారని, వెంటనే ఆపాలని కాలనీవాసులు కోరారు. కొంతమంది రోడ్డు ఆక్రమించారని, వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. 13వ డివిజన్ ప్రగతినగర్‌లో రోడ్డు ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపట్టారని, వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. 10వ డివిజన్ రాజ్‌పుత్ వీధిలో కాల్వలు శుభ్రం చేయడం లేదని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. రాంపూర్‌లోని డంపింగ్ యార్డును శాశ్వతంగా తొలగించాలని మడికొండ గ్రామ అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. డంపింగ్ యార్డు నుంచి వచ్చే విష వాయువులతో ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నామని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. గతంలో పలుమార్లు వినతులు ఇచ్చినా స్పందన లేదని తెలిపారు. 22వ డివిజన్‌లోని వైష్ణవి అపార్ట్‌మెంట్ ముందు ఉన్న డబ్బాలను తొలగించాలని అపార్ట్‌మెంట్ వాసులు వినతిపత్రం అందజేశారు. కాశీబుగ్గ కోటిలింగాల గుడి వద్ద ప్రతి రోజూ మున్సిపల్ ట్రాక్టర్లు వచ్చి సేకరించిన చెత్తను కాల్చి వేస్తున్నారని, విష వాయువులతో అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు. అనంతరం కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ.. గ్రీవెన్స్ వినతుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. ఈ గ్రీవెన్స్‌లో మొత్తం 115 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 52, ఇంజినీరింగ్ విభాగం 20, ప్రజారోగ్య విభాగం 7, పన్నుల విభాగం 17, తాగునీటి సరఫరా 14. ఎలక్ట్రికల్స్ 2, సాధారణ విభాగం 3 వినతులు వచ్చాయి. గ్రీవెన్స్‌లో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీందర్ రాడేకర్, హెచ్‌వో లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

భద్రకాళీ బండ్ పార్కు గేట్‌కు తాళం

- గేటు ఎదుట వాకర్స్ ఆందోళన, ధర్నా
- పోలీసుల జోక్యంతో వాకింగ్‌కు అనుమతి

న్యూశాయంపేట, ఏప్రిల్ 28 : నగరంలోని భద్రకాళీ బండ్ బయో డైవర్సిటీ పార్కు గేటుకు నిర్వాహకులు తాళం వేయడంతో వాకర్స్ సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వాకర్ వీరస్వామి మాట్లాడుతూ.. నగరంలోని చాలా మంది ప్రతిరోజూ ఈ పార్కులో వాకింగ్ చేస్తారని, కానీ నిర్వాహకులు రూ.వెయ్యి చెల్లించి పాస్ తీసుకుని వాకింగ్ చేయాలని చెప్పారని తెలిపారు. దీంతో తాము రోడ్డుపై ఆందోళన, ధర్నాకు దిగామన్నారు. నిర్వాహకుల ఫిర్యాదుతో సుబేదారి పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి విషయం తెలుసుకుని, పార్క్ నిర్వాహకులతో చర్చించి వాకింగ్ చేసుకునేందుకు అనుమతి ఇప్పించారని పేర్కొన్నారు.

రైల్వే పట్టాలపైకి వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసు

కాజీపేట, ఏప్రిల్ 28 : ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే పట్టాల పైకి వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలపై కాజీపేట ఆర్పీఎఫ్‌లో కేసులు నమోదైన ఘటన సోమవారం జరిగింది. ఆర్పీఎఫ్ సీఐ చటర్జీ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కతుర్తిలో ఆదివారం సాయంత్రం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభకు ఉప్పల్ రైల్వే గేట్ మీదుగా భారీగా వాహనాలు తరలి వెళ్లాయి. కాజీపేట – బల్లార్షా సెక్షన్‌లో రైళ్ల రద్దీ విపరీతంగా ఉంటుంది. దీంతో రైళ్లు వస్తున్న సమయంలో ఉప్పల్ రైల్వేస్టేషన్ సమీపంలోని 14టీ రైల్వేగేట్‌ను గేట్‌మెన్ మూసివేశాడు. కాగా, సభకు వచ్చిన కార్యకర్తలు రైల్వే గేట్ మూయడంతో తమ వాహనాలు దిగి రైల్వే గేట్ సమీపంలోని రైలు పట్టాలపైకి వచ్చారు. దీంతో న్యూ ఢిల్లీ నుంచి చెన్నైకి వెళ్తున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ రైలు పట్టాలపై భారీగా జనం ఉండడంతో రైలును పది నిమిషాల పాటు రైల్వే గేట్ సమీపంలో నిలిపివేశాడు. ఆ తర్వాత స్థానిక అధికారుల సూచనలతో రైలు కదిలింది. లోకో పైలట్ సమాచారం మేరకు రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాలతో రైలు పట్టాలపైకి వచ్చిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తల పై కేసులు నమోదు చేశామని వివరించారు.

10వ రోజుకు చేరిన కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 28 : కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె 10వ రోజుకు చేరింది. కేయూ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదురుగా చేస్తున్న సమ్మెలో కాంట్రాక్ట్ ప్రొఫెసర్ జేఏసీ నేతలు కర్ణాకర్, భాస్కర్, కనకయ్య, బైరి నిరంజన్, శ్రీధర్‌కుమార్‌లోథ్ పాల్గొని మాట్లాడారు. సతీశ్, సూర్యనారాయణ, చంద్రశేఖర్, ఫిరోజ్‌పాషా, ప్రసాద్, వీణ, కవిత, నరసింహుల రాజు, రఘువర్ధన్‌రెడ్డి, సునీత, భాగ్య, సుకన్య, ఉషాకిరణ్, శ్రీలత ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, ఏప్రిల్ 28 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాలసముద్రం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఎల్ఐసీ ఆఫీస్, మార్కెట్, బాలసముద్రం ఏరియా, అంబేద్కర్ సెంటర్, నక్కలగుట్ట మెయిన్ రోడ్డు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

పెద్దిని సుదర్శన్‌రెడ్డికి అభినందనలు

పెద్దిని అభినందిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు

హనుమకొండ, ఏప్రిల్ 28: నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు అభినందించారు. ఆదివారం ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్ల బృందంలో సభ్యుడు కాగా, సభ విజయవంతంలో భాగస్వాములైనందుకు వారు సభా వేదికపై పెద్దికి వారు అభినందనలు తెలిపారు.

ఉపాధి పనులకు కూలీలు రావాలి

దామెర, ఏప్రిల్ 28 : మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు కూలీలు రావాలని ఏపీవో శారద సూచించారు. సోమవారం మండలంలోని ల్యాదెళ్ల, దామెర, పులుకుర్తి, ఊరుగొండ, దమ్మన్నపేట తదితర గ్రామాల్లో జరుగుతున్న మట్టి రోడ్డు, ఫీడర్ చానల్ పనులను పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు సారంగం, శ్రీనివాస్, కుమారస్వామి పాల్గొన్నారు.

జాతీయస్థాయి విద్యా సంస్థలతో పోటీ పడాలి

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 28 : మెరుగైన విద్యను అందిస్తూ జాతీయ స్థాయి విద్యా సంస్థలతో పోటీ పడాలని కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఫార్మసీ విభాగానికి పునర్ వైభవం తీసుకురావాలన్నారు. కొనసాగించాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల, తెలంగాణ టెక్నికల్ ఎడ్యుకేటర్ అవార్డు-2025 అందుకున్న నేపథ్యంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, కాలేజీ బోధనా సిబ్బందిని వీసీ సోమవారం అభినందించారు. కేహబ్ వినియోగంలోకి రాగానే పరిశోధనలపై దృష్టి పెట్టాలన్నారు. మెరుగైన ర్యాంక్ కోసం కృషి చేయాలన్నారు. డీన్ గాదె సమ్మయ్య, నరసింహారెడ్డి, కృష్ణవేణి, నాగరాజు పాల్గొనారు.

వీసీని అభినందిస్తున్న కేయూ ఫార్మసీ ప్రిన్సిపాల్

కొత్త చట్టంతో సమస్యలు పరిష్కారం

మంత్రులు పొంగులేటి, పొన్నం

ఎల్కతుర్తి : మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన మంత్రి పొన్నం

ఎల్కతుర్తి, ఏప్రిల్ 28 : భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలన్నీ పరిష్కార మవుతాయని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మండల కేంద్రంలో కొత్త చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. రైతుల ఇండ్ల వద్దకే రెవెన్యూ అధికారులను పంపించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్